స్నేహ మాసపత్రిక (మార్చి 78)

# శాంతి

"ఏయ్ సుజా! నీ సవితల్లి కాపరానికి వచ్చేసిందా?' అని వెకిలిగా నవ్వుతూ అడిగింది నళిని.

'షటప్!' పళ్ళు పటపట లాడించింది సుజాత.

'సుజా వాళ్ళ నాన్నగార్కి పెళ్ళెప్పుడయిందే?' అని సుజాతవైపు చూసి వ్యంగ్యంగా నవ్వుతూ నళిని భుజం తట్టి అడిగింది సులోచన.

'మనకు శుభలేఖ రాలేదు.. కనుక, పెళ్ళయిందో లేదో మనకు తెలియదు. కాని, హానిమూన్ మాత్రం అయిపోయిందిట!' అని ఆగింది నళిని.

'రాస్కెల్స్' అంది సుజాత కోపావేశంతో.

'మేం రాస్కెల్స్‌మే కాని, నీ డియరెస్ట్‌ఫ్రెండ్ శాంతిలా రోగ్స్ మాత్రం కాదు మహారాణీ! మీ నాన్న గార్కి... శాంతికి...'

'నోర్మూస్తావా ముయ్యవా?' అంటూ నళినిని కొట్టబోయింది సుజాత.

సమయానికి స్వర్ణలత అడ్డుపడకపోతే ఆ పూట కాలేజీలో పెద్ద గొడవయ్యేది. సుజాత చెయ్యి పట్టుకొని దూరంగా తీసుకుపోయింది స్వర్ణలత.

'కుళ్ళుమోతుమనుషులు. ఎంతెంత అభాండాలు వేస్తున్నారో చూడు!' సుజాత దుఃఖభారం తగ్గేవరకు స్వర్ణలత ఏమీమాట్లాడలేదు.

'వీళ్ళ పాడు మాటలకి తగ్గట్టుగానే ఈ మధ్య శాంతి నాతో సరిగా మాట్లాడటమే లేదు...'

సుజాత మాటలకడ్డువచ్చింది స్వర్ణలత. 'నువ్వేమీ అనుకోనంటే ఓ మాటచెప్పనా?'

'ఏమిటీ?'

'నిప్పులేందే పొగరాదు. పోనీ! మీ నాన్నగారినో సారి అడగకూడదూ?'

'ఛ! నువ్వూ వాళ్ళలాగే అనుమానిస్తున్నావా? ఆయన వయస్సెంత? శాంతి వయస్సెంత?'

స్వర్ణలత మాట్లాడలేదు.

'కామెర్ల కళ్ళకి లోకమంతా పచ్చగానే కనిపిస్తుందట! శాంతిని నాతోపాటు సమానంగా కూతుర్లా చూస్కుంటున్నారాయన. ఎప్పుడూ అలాంటి పాడు బుద్ధులు ఆయనకి లేవు. రావు!' అంది సుజాత ధృఢస్వరంతో.

'శాంతి అంటే నాకేమన్నా పగాయేమిటి సుజా! నా కళ్ళతో నేను చూశాను కనక.'

సుజాత చకితురాలైంది. 'ఏం చూశావు? చెప్పు' అంది కంగారుగా.

'నీకు తెలియకుండా శాంతి, మీనాన్న గారూ బయట కల్సుకుంటున్నారని మా అన్నయ్య రెండుమూడు సార్లు చెప్పాడు. వాడేదో పొరపాటు పడ్డాడని నేనూ అనుకున్నాను. కాని క్రితం వారం వాళ్ళిద్దరూ కలిసి సినిమాకి వెళ్ళటం నా కళ్ళతో నేను చూశాను. ఆ మర్నాడు ఇండైరెక్టుగా నిన్ను అడిగితే మీ నాన్నగారు రాత్రి ఏదో ఆఫీసు పనిమీద లేటుగా వచ్చారని చెప్పావు. మొన్న వాళ్ళిద్దరూ హోటల్‌కివెళ్ళటం నేను చూశాను. శాంతి తన కొంట్లో బాగోలేదని అబద్ధమాడటం - ఇదంతా చూస్తుంటే...'

అనుమానంగా చూసింది సుజాత.

'ఇవేళ శాంతి కాలేజికి రాలేదు. కాని, ఇప్పుడది మీ ఇంట్లోనే ఉంది! రిక్షాలో మీయింటి ముందు దిగటం గంట క్రితం నా కళ్ళతో నేను చూశాను!'

సుజాత ముఖం తెల్లగా పాలిపోయింది. 'లతా!' అంది నీళ్ళు నిండిన కళ్ళతో.

'సారీ సుజా! చెప్పకూడదనుకుంటూనే చెప్పేశాను. నీకు తెలియకుండా నీకన్యాయం జరుగుతోందని...'

• • •

ఇంటికి వచ్చిన సుజాత శేషగిరిగారి కెదురుగా కూర్చున్న శాంతిని చూసి కుపితురాలై పోయింది. 'కాలేజీ ఎగ్గొట్టి ఇక్కడేం ఘనకార్యం చేస్తున్నావే?'

శాంతి మాట్లాడలేదు. తలదించుకుంది.

'మాట్లాడవేం?' అని గొంతు హెచ్చించింది సుజాత.

'ఏమిటమ్మా సుజా? ఏమయింది? రా యిలా కూర్చో!' అంటూ శాంత స్వరంతో పిలిచాడు శేషగిరి.

తండ్రిని, స్నేహితురాలిని మార్చి మార్చి చూసి ఎలా అడగాలో తెలియక మనస్సులోని బాధని అణుచుకోనూ లేక విసురుగా వచ్చి మరో కుర్చీలో దబ్బుమని చతికిలపడింది సుజాత. తండ్రి తాపీగా సిగరెట్టు వెలిగించుకోవటం, శాంతి స్తబ్దుగా కూర్చోవటం ఆమె అసహనాన్ని మరింత పెంచాయి. 'ఇవేళ కోర్టుకి వెళ్ళలేదేం నాన్నా?'

'మధ్యాహ్నం కాని కేసుల్లేవమ్మా'

'ఓహో! ఆ సంగతి ముందే నాకు తెలిస్తే బాగుండేదే?' అంది సుజాత క్రీగంట శాంతి వైపు చూస్తూ.

'ఏం అలా అడిగావు!' అన్నాడు శేషగిరి చిరునవ్వుతో.

'శాంతిలాగే నేనూ కాలేజీ మానేసే దాన్ని కదా అని!' అంది వ్యంగ్యంగా.

అతను వెంటనే మాట్లాడలేదు.

'నే నడిగిన దానికి ఎవ్వరూ ఏమీ పలకరేం?'

'శాంతి ఇక్కడికి రావడానికి కారణం ఉందమ్మా?'

'ఏమిటా కారణం?'

శాంతి చటుక్కున పైకిలేచి 'నేను వెళ్ళొస్తానండీ!' అంది శేషగిరితో.

'ఛీ!' తండ్రి చేయి విదిలించుకొని తన గదిలోకి వెళ్ళి మంచం మీద పడి పోయి పెద్దగా ఏడవసాగింది సుజాత. ఆమె ఏడ్చి ఏడ్చి ఎప్పుడో నిద్రలోకి ఒరిగిపోయింది. అంతసేపూ శేషగిరి ఆమె దగ్గరకి కూడా వెళ్ళలేదు.

సుజాతకి మెలకువ వచ్చేసరికి శేషగిరి ఆమె మంచం ప్రక్కనే కుర్చీలో కూర్చుని కనిపించాడు. చటుక్కున ముఖం ప్రక్కకి తిప్పుకొంది.

'నా మీద ఇంకా కోపం పోలేదామ్మా?' అన్నాడతను ఆమె వెన్ను నిమురుతూ.

'నా కెందుక్కోపం?'

'మరి అంతగా ఏడ్చావెందుకు?'

ఆమె పలకలేదు.

'చెప్పమ్మా! నేనేమీ అనుకోను?'

'నీ గురించి, శాంతి గురించి ఊళ్ళో చాలామంది పాడు మాటలనుకొంటున్నారు నాన్నా!!

గాఢంగా నిట్టూర్చి 'కొంచెం ముఖం కడుక్కొని రామ్మా! నీతో కొన్ని సంగతులు చెప్పాలి'.

అన్నాడతను.

తనంతట తానే తండ్రి ఏదో చెబుతాననే సరికి గబగబా లేచి వెళ్ళి ముఖం కడుక్కొని వచ్చింది సుజాత. ఈలోగా కాఫీలు కలిపి తెచ్చాడు శేషగిరి.

'మీ అమ్మ చిన్నప్పుడే పోయింది. మళ్ళీ పెళ్ళి చేసుకోమని పోరు పెట్టారు చుట్టాలు. కనీసం నువ్వు చంటిపిల్లవని, నీ కోసమయినా చేసుకోమని బలవంతం చేశారు స్నేహితులు. అప్పుడు వద్దన్న వాడిని ఈ వయసులో మళ్ళీ పెళ్ళికావాలనుకుంటునామ్మా! అందులో శాంతి లాంటి చిన్నపిల్లనా?'

'నీ కెప్పుడు అలాంటి ఆలోచనలు రావని నాకు తెలుసు నాన్నా! కాని లోకులు చెప్పు కుంటున్న మాటలు, నేవిన్నది - ఇదంతా ఎందుకు జరిగింది? మీ రిద్దరూ లేనిపోని అనుమానాలకి చోటు ఎందుకిచ్చారు?'

'అనుమానం కాదమ్మా! అందులో కొంత నిజముంది.'

సుజాత చకితురాలయింది. 'నాన్నా!'

'అవునమ్మా! ఎప్పుడు ఎవరి మనుసులో ఏముంటుందో ఎవరమూ చెప్పలేము.'

'నువ్వనేది ఏమిటో అర్థం కావటం లేదు!' అందామె అయోమయంగా.

'శాంతి. శాంతి వ్రాసిన ప్రేమ లేఖలు ఇవిగో!'

'ప్రే...మ......లే.....ఖ...లా..! ఎవ్వరికి?'

'నాకు, నాకు వ్రాసినవే!'

• • •

'శాంతి ఉందాండీ?' అని అడిగింది సుజాత.

'ఉందమ్మా? తలనొప్పిగా ఉందని పడుకొంది.' అంది శాంతి తల్లి కాత్యాయిని. శాంతి గదిలోకి నడిచింది సుజాత. ఆమెను చూచి లేచి కూర్చుంది శాంతి.

'నీ ఒంట్లో బాగోలేదట!' అంది సుజాత మార్దవ స్వరంతో.

'ఊఁ'

'నీతో ఒక ముఖ్యమైన సంగతి మాట్లాడాలి.'

శాంతి ఒక్క క్షణం ఆగి 'నేనిప్పుడు బయటికి రాలేను.'

సుజాత నిగ్రహం కోల్పోయింది. 'ఎందుకు రాలేవు? సినిమాలకి, షికార్లకి వెళ్ళగలిగిన ఓపిక నాతో కాసేపు బయటకి రావటానికి లేదా?'

'నన్ను క్షమించు సుజా! ఇప్పుడు రాలేను. చెప్పవల్సింది ఇక్కడే చెప్పు.'

'నా మాటలు మీవాళ్ళు వినటం నా కిష్టంలేదు.'

'కూర్చో' అని, గది తలుపులు వేసి వచ్చి - 'చెప్పు' అంది.

సుజాత వెంటనే పలకలేదు. ఆమె చేయి పట్టుకొని కూర్చోబెట్టింది శాంతి.

వేనిటీ బాగ్‌లోని ఉత్తరాలు తీసి, 'ఇవేమిటి' అని అడిగింది సుజాత.

శాంతి కళ్ళు దించుకొంది.

'మాట్లాడవేం?'

'ఈ వ్యవహారం ఎన్నాళ్ళనించి సాగుతోంది? మా నాన్నగారు తప్పు తప్పని చెబుతున్నా నువ్వెందుకు వినవు? అసలు నీ బుర్రలో ఇలాంటి పిచ్చి ఆలోచన ఎలా వచ్చింది?'

'ఏమో నాకు తెలియదు. ఇప్పుడు అడుగు వెనక్కి తీసుకోలేని స్థితిలో ఉన్నాను. ప్లీజ్! నన్నర్థం చేసుకో.'

'ఛీ దౌర్భాగ్యులారా! ఇప్పటికే నలుగురూ నానా మాటలూ అనుకొంటున్నారే, అదే జరిగితే అంతా ముఖాన్న చీవాట్లు పెడతారు' అంది  సుజాత కోపంగా.

'నేనేం రహస్యంగా చేద్దామనుకోవటం లేదు.'

'ఇడియట్‌లా మాట్లాడకు. ఈ పాడు పనికి రహస్యం కూడాను?'

'నేనేం పాడుపని చేయడం లేదు. మీ అందరితోటి చెప్పి అప్పుడు పెళ్ళి చేసుకుందామను కుంటున్నాను.' అంది శాంతి కొంచెం గొంతు హెచ్చించి.

'పెళ్ళి? పెళ్ళి చేసుకోవటానికి లోకంలో ఎంతోమంది పడుచువాళ్ళుండగా, ఛ! నీ కాయనే కావల్సివచ్చారా? ఆయన వయస్సేమిటి? నీ వయస్సేమిటి?'

'ప్రేమకి వయసుకి సంబంధం లేదు.'

'ప్రేమ! ఛీ! కళ్ళు పొరలు కమ్మి ఒళ్ళూపైనా తెలియకుండా మాటాడుతున్నావే నీకసలు ప్రేమకర్థం తెలుసా?'

'నువ్వెన్ని ఉపన్యాసాలిచ్చినా నా మనసులో కోరికల్ని చంపలేవు.'

'నేను వచ్చింది నీ కోరికల్ని చంపటానికికాదే! నీ మూర్ఖత్వంతో మమ్మల్నందర్నీ చంపబోతున్నావని చెప్పటానికి!'

'నీకు కాని, మీ నాన్నగారికి కాని అపకారం చేయాలని నేననుకోవటం లేదు?'

'ఇంతకన్నా వేరే యేం చేయాలి? ఇప్పటికే ఊరూ వాడా అంతా అసహ్యంగా చెప్పుకుం టున్నారు. వయసులో ఉన్నదానికి, దానికి కళ్ళు మూసుకుపోతే పోయాయి. ఆ ముసలాయన బుద్ధేమయింది అని అంతా మా నాన్నగారినే అంటున్నారు!'

'ఎందుకంటున్నారు? మేము ఎవరి కపకారం చేస్తున్నామని?' అంది శాంతి మరింత గట్టిగా.

'ఎవరికా? ఇంకెవరికే? నువ్వు చేసే పని నా కపకారం కాక ఉపకారమవుతుందా? చెప్పు...' అని అరిచింది సుజాత.

ఆ గది తలుపులు భళ్ళున తెరుచుకుని లోపలికి వచ్చి 'ఏమిటమ్మా! ఏదో గొడవపడు తున్నారు?' అని అడిగింది కాత్యాయిని.

సుజాత చటుక్కున వెనక్కి తిరిగి చేతుల్లో ముఖం దాచుకుంది. ఆమె అపుకుంటున్న ఏడుపుని  ఎగసిపడే ఆమె డొక్కలు దాచలేకపోతున్నాయి.

'ఏమిటి సుజాత? ఏమిటి? ఏమే శాంతీ? మాట్లాడవేం?'

శాంతి నిశ్చలంగా నిలబడింది.

'నువ్వు చెప్పమ్మా! నిన్నెవరేమన్నారు? శాంతి ఏమన్నా అందా? అసలేం జరిగింది? చెప్పమ్మా?' అంటూ సుజాతని బ్రతిమాలసాగింది కాత్యాయిని.

గబగబా కళ్ళు తుడుచుకుని 'నన్నిప్పుడేమీ అడక్కండమ్మా! నేనేం చెప్పలేను' అని వెళ్ళిపోబోయింది సుజాత.

ఆమె చేయి పట్టుకొని ఆపింది ఆవిడ. 'చూడమ్మా! నీకు తల్లిలాంటి దాన్ని. నాకు నువ్వొకటి శాంతి ఒకటీ కాదు. నీ బాధేమిటో చెప్పు.'

'ఎలా చెప్పనమ్మా ఏమని చెప్పను?' అంటూ తలపట్టుకుంది సుజాత.

'ఇవేళ కాకపోతే రేపయినా అమ్మకి తెలియవల్సిందే! నేనే చెబుతాను...' అంది శాంతి.

సుజాత ముఖం వెలవెలబోయింది.

'ఏమిటి శాంతి?' అని అడిగింది కాత్యాయిని.

'నేను... నేను పెళ్ళి చేసుకుందామనుకుంటున్నానమ్మా!' అంది శాంతి తొణక్కుండా.

కాత్యాయిని చకితురాలైంది. 'పెళ్ళా?'

'అవునమ్మా! ఇన్నాళ్ళు మీరు సంబంధాలు చూస్తుంటే వద్దన్నాను. కాని, ఇప్పుడు నాకు చేసుకోవాలనిపించింది.'

'సరే! దానికింత బాధపడాల్సింది ఏముంది? ఇంతకీ అబ్బాయి ఎవరు?'

శాంతి తలదించుకుంది. సుజాత తల పట్టుకుంది.

'చెప్పు. ఎవరతను? మీ క్లాసుమేటా?'

తల అడ్డంగా త్రిప్పింది. 'కాదు.'

'మరి?.. ఉద్యోగస్తుడా?'

'అవును. లాయరుగామంచి ప్రాక్టీసు ఉంది.'

'అయితే మంచిదే!... ఎవరతను?'

'మా నాన్నగారు. శాంతి మా నాన్నగార్ని చేసుకుంటుందిట. ఇదిగో అది ఆయనకి వ్రాసిన ప్రేమలేఖలు.." అంది సుజాత గద్గద స్వరంతో.

కాత్యాయిని నిర్ఘాంతపోయింది.

'అవునమ్మా! ఆయన్నే పెళ్ళి చేసుకుందామనుకుంటున్నాను.'

'నోర్ముయ్!'

తల్లి చేత చెంపదెబ్బలు తిన్నా శాంతి నిశ్చలంగా అలాగే నిలబడింది.

'మీరు నా నోరు మూయించగలరు కాని మనస్సుని మూయించలేరమ్మా! నేనేం తప్పు చేయటం లేదు. నాకిష్టమైన మనిషితో నా పెళ్ళి చేసుకుంటున్నాను. మీతో చెప్పే చేస్తానంటున్నాను.'

'అయ్యో. ఇదెక్కడి పిచ్చే నీకు? ఎక్కడో మోసం జరిగింది. ఎవరో దీని మనస్సు పాడు చేసేశారు' అంది కాత్యాయిని ఏడుస్తూ.

'మీరెందుకంతగా బాధపడుతూన్నరో నాకర్థం కావటంలేదు. లోకంలో ఇంత కన్న వింతైనవి జరుగుతున్నాయి. అందమైన భార్య ఉండగా – మరో ఆడ దానితో సంబంధం పెట్టుకునే మగవాళ్ళెంతో మందున్నారు. ఆయన అలాంటి పనేం చేయటం లేదు...'

'కనుకనే, ఆయన ప్రతిష్ఠని నాశనం చేయవద్దని చెపుతున్నా' అంది సుజాత కోపంగా.

'నువ్వనుకునేంత ఘోరం నేనేం చేయడం లేదు. ఆయనకి భార్యలేదు. నాకు పెళ్ళి కావల్సి వుంది. అందుకే ఈ పెళ్ళి.'

'నోర్ముయ్యవే పాపిష్టిదానా?' అంది కాత్యాయిని క్రింద కూలబడిపోతూ.

'మీతో చెప్పకుండా చేసుకుంటే ఏం చేసేవారు? ముందు చెప్పబట్టే కదా నాకీ తిట్లు!'

'అదంతా నాకనవసరం. నేను ముందే చెపుతున్నా.... నేనుబ్రతికుండగా మీకిద్దరికి పెళ్ళికాదు. నువ్వు నాన్నగార్ని బలవంతం చేస్తే నువ్వు నాశవాన్నే చూస్తావు?' అని సుజాత విస విసా నడుస్తూ బయటికి వెళ్ళిపోయింది.

● ● ●

ఇరవై రోజులు గడిచాయి. ఇన్నాళ్ళూ సుజాత కాలేజీకి వెళ్ళలేదు. శాంతి మళ్ళీ వస్తుందేమో – ఆమె నెదుర్కొందామని ఎన్నో అస్త్రాలు సిద్ధంగా పెట్టుకుంది. కాని, ఆమె రాలేదు.

ఇన్నాళ్ళూ కాలేజికి వెళ్ళదేమని శేషగిరి అడగలేదు. శాంతి కాని అతన్ని మళ్ళీ కల్సిందా అని సుజాత అడగలేదు. ఇద్దరి మధ్యా మౌనం గూడుకట్టుకొని ఉంది. భారంగా బాధగా గడిచిపోయాయి ఇన్ని రోజులూ!

ఆ వేళ ఇంటికి వస్తూనే 'శాంతి నీకీ ఉత్తరం ఇచ్చిందమ్మా!' అని ఆమె చేతిలో ఓ కవరు పెట్టాడు శేషగిరి.

'ఛీ! దానితో నాకిక సంబంధమేమిటి?' అని ఆ కవరు చింపివేయ బోయింది ఆమె కోపంతో.

'తొందరపడకమ్మా! చదువు... చదివాక ఇష్టం లేకపోతే అప్పుడే చింపేద్దువుగాని...' అన్నాడు అతను.

తండ్రి మాట కాదనలేక కవరు విప్పింది సుజాత.

'సుజా డియర్!

జరిగినదంతా వివరంగా నిన్ను కల్సినప్పుడు చెపుతా. కాని, ముందు నీ మనస్సుని ఆవరించిన కారుమబ్బుల్ని 'తొలగించటానికిది వ్రాస్తున్నాను'.

ఇంతకాలం మీ నాన్నగారితో పాటు నేనాడిన నాటకంలో... నీకు తెలియకుండానే నువ్వొక ముఖ్యపాత్ర వహించావు. నా ప్రేమలేఖలు, పెళ్ళి అదంతా ఒక కల్పన. ఆ వేళ ఓపిగ్గా నిన్ను రెచ్చకొట్టి నీ చేత చివాట్లు తిన్నది, ఓర్పుతో అమ్మ చేత చెంపదెబ్బలు తిన్నది .....

ఎందుకో చెప్పనా? మా యింటికి పట్టుకున్న చీడపురుగుని చాకచక్యంగా తీసి అవతల పారవేద్దామని!

ఆ వేళ ఒక మాట అన్నాను గుర్తుందా! లోకంలో అందమైన భార్య ఉండగా మరో ఆడ దానితో సంబంధం పెట్టుకునే మగవాళ్ళెంతో మందున్నారని! దురదృష్టవశాత్తు.. నేను రిఫర్ చేయవల్సి వచ్చిన మనిషి ఎవరో కాదు సుజా! మై ఓన్ ఫాదర్!

తన్ను ప్రేమించి పెళ్ళాడిన భర్త హఠాత్తుగా ఇన్నాళ్ళకి మరో ఆడదాని వలలో... అందులో పడుచుపిల్ల వలలో పడిపోయాడని తెలిస్తే అమ్మ భరించగలదా? ఆవిడ గుండె బ్రద్దలయి పోదూ? అమ్మకి తెలియకుండా నాన్నగార్ని తప్పు దారి నుంచి తప్పించడం ఎలా? చిన్న దాన్ని, నాన్నా నువ్వు చేస్తున్నది తప్పు అని నేనెలా చెప్పగలను? అందుకే మీ నాన్నగారితో ఆలోచించి ఈ ప్లాను వేశాను. మా నాటకంలో నీ పాత్ర చాలా ముఖ్యమైంది. నువ్వలా మాట్లాడితే కాని... విషయం ఎంత సీరియస్ అయిందో అమ్మకి తెలియలేదు. అందుకే నీకిది మేము చెప్పలేదు!

నువ్వావేళ అలా కేకలు పెట్టివెళ్ళావు. ఆ తర్వాత అమ్మ ఆ ప్రేమలేఖలు చూపించి సంగతంతా నాన్నగారితో చెప్పి పెద్ద రాద్ధాంతం చేసింది. అప్పటికే మా మీద పుకార్లు నాన్నగారి చెవులు దాకా వెళ్ళాయి. ఇప్పుడది నిజమని నేనే అంటున్నాను. కాని, తానే అటువంటి తప్పు చేస్తున్నప్పుడు ఆయన నాకేమని బుద్ధి చెప్పగలరు?

మేము తీసుకున్నది రిస్క్ అయినా అనుకున్న విధంగా మా ప్లాను సక్సెస్ అయింది. నాన్నగారు కళ్ళు తెరుచుకున్నారు. ఆయన్ని మాయలో పడవేసిన ఆ వన్నెలాడి స్టెనోకి ట్రాన్స్‌ఫర్ ఆర్డర్సు వచ్చాయి. మా చుట్టూ పేరుకున్న నీలి నీడలు తొలగిపోయాయి. ఇప్పు డాయన ఇంటికి పెందరాళే వస్తున్నారు. ఆ ఆనందంలో మా అమ్మ నేను చేసిన 'తప్పు'ని మరిచేపోయింది!

మీ నాన్నగారు అపనిందలకి కూడా వెనుదీయకుండా మా కుటుంబానికి చేసిన సహాయానికి మేమెంతో ఋణపడి ఉన్నాము. ఆయన నాకు అండగా నిలిచి ఉండకపోతే. నేనీ సమస్యని ఇంత త్వరగా పరిష్కరించుకోగలిగేదాన్ని కాదు!

ఇంతకాలం నిన్ను బాధపెట్టినందుకు నన్ను క్షమించు. నీ రాక కోసం నా కళ్ళల్లో వెయ్యిజ్యోతులు వెలిగించుకొని ఎదురుచూస్తున్నా....

బైదిబై - నీ సవతి తల్లిని కాబోయే కార్యక్రమాన్ని విరమించుకున్నానని మా అమ్మతో చెప్పేశాను. నాకా 'పిచ్చి' ఎందుకు పట్టిందో.. ఎలా వదిలిందో పాపం అమ్మకు తెలియనే తెలియదు. నాకిక పెళ్ళి మీద దృష్టిమళ్ళిందని అనుకుంది కాబోలు - నాన్నగార్ని తొందరపెట్టి నాకో సంబంధం చూడమంది. రేపే నా పెళ్ళి చూపులు! తప్పక వస్తావు కదూ!

– నీ శాంతి.